కొండలా పేరుకుపోతున్న చీపుర్లు



అంటిమానుగూడలో నిల్వ చేసిన చీపుర్లు



చింతమానుగూడలో తయారు చేసిన చీపుర్లు

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలో కొండచీపుర్ల సేకరణ, తయారీ కుటీర పరిశ్రమగా మారిపోయింది. ప్రస్తుతం కొండచీపుర్లకు మద్దతు ధర లేకపోవడంతో గిరిజనుల ఇళ్ల వద్ద నిల్వలు పేరుకుపోతున్నాయి. మండలంలోని అంటిమానుగూడ, చింతమానుగూడ, మోహన్ కాలనీ, గోరపాడు, చిన్నబగ్గ, మర్రిపాడు, పూతికవలస, తదితర గ్రామాలకు చెందిన గిరిజనులకు కొండచీపుర్ల సేకరించి, విక్రయిస్తుంటారు. అయితే ప్రస్తుతం ఆశించిన ధర రావడం లేదని గిరిజనులు చెబుతున్నారు. గిరిజన ఉత్పత్తులను కొనాల్సిన జీసీసీ అధికారులు కూడా కొండచీపుర్ల కొనుగోలుకు పెద్దగా ఆసక్తి కనబరచడం లేదు. దీంతో చేసేదేమీ లేక సంతల్లో విక్రయించుకుంటూ, మిగిలినవి ఇళ్ల వద్ద నిల్వ చేసుకుంటున్నారు. అయితే నిల్వలు బాగా పెరిగిపోవడంతో ఆయా గ్రామాల్లో కొండలను తలపిస్తున్నాయి. ఇటీవల గిరిజన సంఘ నాయకులు ఆందోళనలు చేపట్టగా.. జీసీసీ అధికారులు గ్రేడ్- 1 చీపురుకు రూ. 45.. గ్రేడ్-2 చీపురుకు రూ. 40.. గ్రేడ్-3 చీపురుకు 35 రూపాయల మద్దతు ధర ప్రకటించి, కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇది ఎంతవరకు విజయవంతమవుతుందో వేచి చూడాలి మరి.

గిరిజన సమస్యలపై స్పందించండి



తహసీల్దారుకు గిరిజన సమస్యలు వివరిస్తున్న సందీప్‌కుమార్

జియ్యమ్మవలస రూరల్: గిరిజన సమస్యలపై అధికారులు స్పందించాలని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆర్ష్ స్వచ్ఛంద సంస్థ స్టేట్ కో–ఆర్డినేటర్ సందీప్‌కుమార్ కోరారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలో తహసీల్దారు రెడ్డి పకీరును శనివారం కలిసి గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. గిరిజనులు సాగు చేస్తున్న కొండపోడు భూములు, రెవెన్యూ భూములకు సంబంధించిన పట్టాలతో పాటు డీ–పట్టాల సమస్యలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. బాధిత రైతులు రెవెన్యూ సదస్సులకు హాజరవ్వడమే మిగిలిపోతుంది తప్ప వారి సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఇప్పటికైనా పెండింగ్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆరోగ్యంపై దృష్టి సారించండి

● న్యాయమూర్తి విజయరాజ్‌కుమార్



రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి విజయరాజ్‌కుమార్

పాలకొండ రూరల్: వేసవి నేపథ్యంలో రిమాండ్ ఖైదీల ఆరోగ్య స్థితిగతులపై జైల సిబ్బంది దృష్టి సారించాలని స్థానిక న్యాయమూర్తి ఎ. విజయరాజ్ కుమార్ ఆదేశించారు. స్థానిక సబ్‌జైల్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడుతూ.. న్యాయపరమైన సలహాలు, సూచనలు కావాలంటే అందిస్తామన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈయన వెంట జైల్ సూపరింటెండెంట్ జోగులు, న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శామ్యుల్ మూరతో పాటు ఇతర ఇబ్బంది ఉన్నారు.

అగ్నిప్రమాద బాధితురాలికి ఆర్థికసాయం



బాధితురాలికి నగదు అందజేస్తున్న సర్పంచ్

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రానికి చెందిన అగ్ని ప్రమాద బాధితురాలు ముగడ జయమ్మకు ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో ఆమె ఇంట్లోని సామగ్రి అంతా కాలిబూడిదైంది. దీంతో ఆమె తనను ఆదుకోవాలని వాట్సాప్ ద్వారా విజ్ఞప్తి చేసింది. స్పందించిన సర్పంచ్ బొత్సాడ గౌరీశంకరరావు, వైశ్య, కాపు సంఘాల అధ్యక్షులు జి.హరిప్రసాద్, మన్మథ తదితరులంతా కలిసి రూ.22,800లను శనివారం అందించారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ కిశోర్ పాల్గొన్నారు.

షడ్రుచుల సమ్మేళనం ఉగాది..



పాలకొండ రూరల్: పంచాంగ పఠనం చేపడుతున్న వీరభద్రశర్మ

పాలకొండ రూరల్: షడ్రుచుల సమ్మేళనమే ఉగాది పర్వదినమని అర్చకుడు జుష్యుల వీరభద్ర శర్మ అన్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా మండలంలోని భాసూరు గ్రామ రామమందిరంలో శనివారం పంచాంగ పఠనం చేశారు. ఈ సందర్భంగా విశ్వావసు నామ సంవత్సరం విశిష్టతను వివరించారు.

భామిని: మండలంలోని పలు గ్రామాల్లో పంచాంగ శ్రవణాలు జరిగాయి. భామిని మొకాసాదారులు కీర్తిరాయి దొరల ఇంట బత్తిలి పురోహితులు రంపా లలిత ప్రసాద్ శర్మ.. నేరడి–బిలో రంపా శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో పంచాంగ పఠనాలు జరిగాయి. రాశి ఫలాలు.. పంటలు ఎలా పండుతాయి.. వర్షాల రాకపై రైతులు అడిగి తెలుసుకున్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రమేష్‌నాయుడు

గరుగుబిల్లి: హెల్మెట్ ధరించి, ప్రాణాలు కాపాడుకోండి అని ఎస్ఐ పి.రమేష్‌నాయుడు కోరారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీ జంక్షన్ వద్ద వాహనదారులకు హెల్మెట్ వినియోగం, ప్రయోజనాలపై శనివారం అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించకుండా వెళ్తూ ఎంతో మంది వాహనదారులు చిన్నచిన్న ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రమాదాలప్పుడు ఈ హెల్మెట్ మన ప్రాణాలను రక్షిస్తుందన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు.

సుబద్రమ్మవలసలో ఏనుగుల సంచారం



పామాయిల్ తోటలో తిరుగుతున్న ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని సుబద్రమ్మవలస గ్రామ పామాయిల్ తోటల్లో ఏనుగుల గుంపు సంచరిస్తోంది. ఆ తోటల పక్కనే వరి, జొన్న పంటపొలాలు ఉండడంతో అటువైపుగా ఏనుగులు వచ్చి, పంటలు ఎక్కడ నాశనం చేస్తాయోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 15 రోజులుగా ఏనుగులు ఇక్కడే సంచరిస్తుండడంతో చాలాచోట్ల పంటలు నాశనమయ్యాయని, నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా చూడాలని రైతులు అధికారులను కోరుతున్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన ఓ 13 ఏళ్ల బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.నారాయణరావు శనివారం తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుంచి బాలిక కనిపించడం లేదన్న బాలిక నాన్నమ్మ రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఎవరికైనా అమ్మాయి ఆచూకీ తెలిస్తే ఫోన్ నంబరు 9121109477కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

బెట్టింగ్ యాప్‌లను నిషేధించాలి

గుమ్మలక్ష్మీపురం: ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను తక్షణమే నిషేధించాలని కాంగ్రెస్ పార్టీ కురుపాం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై మండల కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. ప్రస్తుతం ఐపీఎల్ జరుగుతున్నందున ఎంతోమంది బెట్టింగ్‌లు వేసి నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాలపై నిఘా పెట్టాలని కోరారు. బెట్టింగ్‌ల్లో భారీగా నష్టపోయిన వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో విచ్చలవిడిగా బెట్టింగ్ యాప్‌లు ఉన్నాయన్నారు.

మద్యంసీసాలు స్వాధీనం

కొమరాడ: మండలంలోని కూనేరు జంక్షన్ వద్ద అక్రమంగా తరలిస్తున్న 18 మద్యంసీసాలను పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఒడిశా రాష్ట్రంలోని కొరాపుట్ జిల్లా, బంధుగాం సమితి నాగుళ్లవలస గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ కె. నీలకంఠం తెలిపారు. అక్రమంగా మద్యం తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రుణ ప్రణాళికల తయారీపై అవగాహన

జియ్యమ్మవలస రూరల్: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో రుణ ప్రణాళికల తయారీపై వీవోఏలకు శనివారం అవగాహన కల్పించారు. మొత్తం 1414 మహిళా సంఘాలు ఉండగా, వాటిల్లో 16,970 మంది మహిళలు ఉన్నారని, 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను వారికి సంబంధించి రుణ ప్రణాళిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేయాల్సిన అవసరం ఉందని ఏపీఎం కె.త్రినాధమ్మ తెలిపారు. రుణ ప్రణాళికల సర్వేకు 140 మందిని ఎంపిక చేసి, శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం ప్రణాళికల తయారీపై దిశానిర్దేశం చేశారు.

శాశ్వత లోక్ అదాలత్‌తో సమస్యల పరిష్కారం

● రెండో అదనపు జిల్లా జడ్జి దామోదరరావు

పార్వతీపురం టౌన్: కేసులకు శాశ్వత పరిష్కారం చూపే లోక్ అదాలత్‌లను ప్రజలు వినియోగించుకోవాలని రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్. దామోదరరావు అన్నారు. శనివారం స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పారాలీగల్ వలంటీర్ల శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నీరు, విద్యుత్ సరఫరాలలో వివాదాలు, పోస్టల్, టెలిఫోన్ సేవల్లో వివాదాలు, ప్రజా సంరక్షణ సేవల్లో సమస్యలు, బ్యాంకులు, ఇతర ఆర్థిక లావాదేవీలు జరిపే సంస్థల్లో వివాదాలను పరిష్కరించే అధికారం శాశ్వత లోక్ అదాలత్‌కు ఉందని వివరించారు. శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడిగా జిల్లా జడ్జి స్థాయి అధికారి ఉంటారని, ఆయనతో పాటు ఇద్దరు సభ్యులు ఉంటారన్నారు. కక్షిదారులు లోక్ అదాలత్‌కు దరఖాస్తు చేసుకుంటే ఎటువంటి రుసుం చెల్లింకుండా సమస్యను పరిష్కరించుకోవచ్చన్నారు. ఇరుపక్షాల అంగీకారం మేరకు తీర్పు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. శాశ్వత లోక్ అదాలత్ ఇచ్చే తీర్పు అంతిమమని.. దీనిపై అప్పీల్ చేసుకునే అవకాశం ఉండదన్నారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యుడు టి.జోగారావు, ఏపీపీ డి. సత్యనారాయణ, సీనియర్ అడ్వకేట్ ఎంవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయండి

పార్వతీపురం: జిల్లాలో గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.నాసర్, సహాయ కార్యదర్శి నాగభూషణం డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఎన్‌డీఏ కూటమి ఇచ్చిన హామీ మేరకు పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీఓ 77ను రద్దు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్సిటీల్లో ప్రవేశం కోసం కామన్ ఎంట్రన్స్ టెస్ట్ తీసుకురావడం వల్ల యూనివర్సిటీల్లో ప్రవేశాలు తగ్గిపోయాయన్నారు. ఏ యూనివర్సిటీకి వారే ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించుకునేలా అనుమతులివ్వాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ వసతిగృహాలకు సొంత భవనాలు కేటాయించాలన్నారు. అలాగే గిరిజన విద్యార్థుల మరణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

గిరిజనులంటే ప్రభుత్వానికి గౌరవం లేదు

● మాజీ ఎమ్మెల్యే కళావతి



వీరఘట్టం: గిరిజనులంటే కూటమి ప్రభుత్వానికి గౌరవం లేదని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ధ్వజమెత్తారు. మండలంలోని వండువలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యక్రమాల్లో గిరిజన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు సముచిత స్థానం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ పాటించకుండా కూటమి ప్రభుత్వం వారిని అవమానిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్ షెడ్యూల్ విడుదల చేయకుండా కూటమి ప్రభుత్వం నిరుద్యోగులతో ఆటలాడుతోందని మండిపడ్డారు. లక్షలాది మంది నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. గతేడాది డిసెంబర్‌లోగా డీఎస్సీ పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన తొలి సంతకం చేశారని, ఆ సంతకానికి విలువ లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. అనంతరం ప్రజలందరికీ విశ్వావసు నామ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

మాదిగలకు న్యాయం జరిగింది



మాట్లాడుతున్న మాదిక ఉద్యోగ సంఘు నాయకులు

పాలకొండ: ఎస్సీ వర్గీకరణ ద్వారా మాదిగలకు న్యాయం జరిగిందని మాదిగ ఉద్యోగుల ఫోరం సీనియర్ నాయకుడు యమ్మల సతీష్‌కుమార్ అన్నారు. పట్టణంలో మాదిగల విజయోత్సవ సభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2004 తర్వాత మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతూ వస్తోందన్నారు. కేంద్రం ఇటీవల ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలపడం హర్షించదగ్గ విషమని చెప్పారు. అనంతరం మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో అలజంగి చిన్నారావు, లోపింటి జడ్డయ్య, బోగి విశ్వేశ్వరరావు, గర్భాపు సత్తిబాబు, బోగి జేమ్స్, యందవ మరియదాసు, తేలటి నీలయ్య, జి. లాజర్స్, కె. వరి, పి. భీమేశ్వరరావు, వై. పుష్పనాథం, మహేశ్వరరావు, రమేష్, రాజు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు తరలిస్తారన్న ఆందోళన వద్దు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకును వేరే చోటుకు తరలించకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ ఆవాల సింహాచలమ్మ స్పష్టం చేశారు. ఇదే విషయమై ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ బ్యాంకు తరలిస్తారనే అపోహలు ఖాతాదారుల్లో ఉన్నాయని, అయితే దేవస్థానం సిబ్బందికి, బ్యాంకు సిబ్బందికి మధ్య నెలకొన్న భేదాభిప్రాయాలను బ్యాంకు రీజనల్ కార్యాలయ సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించేందుకు చర్చలు జరుగుతున్నాయన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యాంకు తరలింపు కాదని, ఖాతాదారులెవరూ ఆందోళన చెందవద్దన్నారు.

రోడ్డుపై నాగావళి నీరు..



నాగావళి ఎడమ కాలువలో 5వ బ్రాంచ్ గుండా ప్రవహిస్తున్న నీరు ప్రస్తుతం వీరఘట్టం బీసీ కాలనీ సమీపంలో రోడ్డుపై ప్రవహిస్తోంది. ఈ బ్రాంచ్ కాలువ పూడికలతో నిండిపోవడంతో పాటు ఆక్రమణలకు గురికావడంతో నీరు రోడ్డెక్కింది. నీటి పారుదలశాఖ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. – వీరఘట్టం

చలివేంద్రం ఏర్పాటు



భగవాన్ సత్యసాయి బాబా మందిరం ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సత్యసాయి మందిరం కన్వీనర్ బసవలింగం మాట్లాడుతూ.. వేసవి నేపథ్యంలో ప్రయాణికుల దాహార్తి తీర్చడానికి ఈ చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డిపో మేనేజర్ శ్రీనివాసరావు, సత్యసాయి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు. – పాలకొండ

పారిశుధ్య కార్మికులకు దుస్తులు..



సీతంపేట గ్రామ సచివాలయ పారిశుధ్య కార్మికులకు సర్పంచ్ ఆరిక కళావతి ఆధ్వర్యంలో శనివారం నూతన దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, గ్రామ కార్యదర్శి బి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. –సీతంపేట

సజావుగా ఇంటర్వ్యూలు

జియ్యమ్మవలస రూరల్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు శనివారం సజావుగా జరిగాయి. మండలంలోని నిరుద్యోగ యువతీయువకుల నుంచి మొత్తం 398 దరఖాస్తులు రాగా ఎంపీడీవో ఎస్. రమేష్ ఆధ్వర్యంలో అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. ప్రతి దరఖాస్తుదారుని ధ్రువపత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, రుణాలకు అర్హులను గుర్తించారు.

అక్రమార్కులపై చర్యలు

● డ్వామా పీడీ రామచంద్రరావు



ఉపాధిహామీ సిబ్బందిని ప్రశ్నిస్తున్న డ్వామా పీడీ రామచంద్రరావు

పార్వతీపురం రూరల్: ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలకు పాల్పడిన అక్రమార్కులపై చర్యలు తప్పవని డ్వామా పీడీ కె. రామచంద్రరావు స్పష్టం చేశారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 30 పంచాయతీల్లో రూ.26.13 కోట్లతో చేపట్టిన 2,412 పనులపై స్టేట్ రిసోర్స్‌పర్సన్ మాధవరావు ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ బృందం వారం రోజులుగా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది. ఇందులో భాగంగా గుర్తించిన లోటుపాట్లను ప్రజావేదిక కార్యక్రమంలో వెల్లడించారు. హార్టికల్చర్ పథకంలో లక్షల రూపాయల అక్రమాలు జరిగాయని సామాజిక తనిఖీ బృందం గుర్తించింది. క్షేత్రస్థాయి సిబ్బంది వేతనదారులకు సంబంధించిన రికార్డులు సక్రమంగా నిర్వహించలేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. మొక్కల పెంపకానికి లక్షలాది రూపాయలు వెచ్చించినట్లు రికార్డుల్లో నమోదు చేశారే తప్ప.. క్షేత్రస్థాయిలో అంత ఖర్చు కాలేదని సిబ్బంది తేల్చారు. దీంతో డ్వామా పీడీ ఉపాధి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమాలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్ల జీతాలను తక్షణమే నిలుపుదల చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జీవీ రమణమూర్తిని ఆదేశించారు.

క్లుప్తంగా

ఏప్రిల్ 2న ఇంటర్వ్యూలు

పాలకొండ: బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న నగర పంచాయతీ పరిధిలోని వారికి ఏప్రిల్ రెండో తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని కమిషనర్ జయరామ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీ పరిధికి చెందిన 296 మంది రుణాలకు దరఖాస్తు చేసుకున్నారని, వారి దరఖాస్తులు పరిశీలించి అర్హులకు రుణాలు మంజూరు చేస్తామని పేర్కొన్నారు.

అదనపు పైప్‌లైన్ వేయండి..



ఈఓ కోటేశ్వరరావుతో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూదనరావు

వీరఘట్టం: స్థానిక మేజర్ పంచాయతీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఈ నెల 27న మహిళలు ఖాళీ బిందెలతో పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసిన విషయం తెలిసిందే. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూదనరావు స్పందించి శనివారం వీరఘట్టంలోని పలు వీధుల్లో పర్యటించారు. తాగునీటి సమస్య ఉన్న దుర్గపేటకు అదనపు పైప్‌లైన్ వేయాలని ఈఓ బి.కోటేశ్వరరావును ఆదేశించారు.

పరామర్శ



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎంపీపీ ఆదినారాయణ

సీతంపేట: మండలంలోని కాగుమానుగూడకు చెందిన సవర చలపతిరావు (14) దోనుబాయి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతూ శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ బిడ్డిక ఆదినారాయణ శనివారం గ్రామానికి చేరుకుని బాలుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

శ్లాబ్ పనుల పరిశీలన



శ్లాబ్ పనులు పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

భామిని: మండల కేంద్రంలోని బత్తిలి కాలనీలో రక్షిత మంచినీటి ట్యాంక్ శ్లాబ్ పనులను క్వాలిటీ కంట్రోల్ అధికారులు శనివారం పరిశీలించారు. క్వాలిటీ కంట్రోల్ డీఈఈ పి.శంకరరావు, ఏఈ ఎస్.భాస్కరరావు కాంక్రీట్ నాణ్యత, తదితర పనులపై ఆరా తీశారు. వారి వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అలికాన సందీప్, కాంట్రాక్టర్, తదితరులున్నారు.

దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులు పరిశీలిస్తున్న ఎంఈఓలు శ్రీనివాస్, భాస్కరరావు, ఏపీఓ బాబూరావు

భామిని: బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించిన దరఖాస్తులను శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు పరిశీలించారు. ఎంఈఓలు ఎ.శ్రీనివాస్, వి.భాస్కరరావు, ఏపీఓ రేగిడి బాబూరావు ఆధ్వర్యంలో ప్రక్రియ సాగింది. అయితే మండల అధికారులు, బ్యాంకర్లు లేకుండా దరఖాస్తులు పరిశీలించడంపై అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

పల్లెల్లో పంచాంగ శ్రవణం



నాగూరులో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న గ్రామస్తులు

గరుగుబిల్లి: ఉగాది పండగ పురస్కరించుకుని, మండలంలోని రావివలస, పెద్దూరు, గరుగుబిల్లి, రావుపల్లి, చినగుడబ, నాగూరు గ్రామాల్లో పంచాంగ శ్రవణం శనివారం సాయంత్రం నిర్వహించారు. విశ్వావసు నామ సంవత్సరంలో శుభ, అశుభ, వర్ష ఫలితాలను పండితులు తెలిపారు. ఏయే ముహూర్తాల్లో ఏయే పనులు చేస్తే మంచిదనే విషయాలను వివరించారు.

జియ్యమ్మవలస: ఉగాది పురస్కరించుకుని, మండలంలోని వెంకటరాజపురంలో పంచాంగ శ్రవణం శనివారం చేపట్టారు. ఉగాది ముందు రోజు అమావాస్య రోజున పంచాంగ శ్రవణం చెప్పడం ఆనవాయితీగా వస్తోందని ఆలయ పూజారి కృష్ణారావు శర్మ తెలిపారు. ఆదివారం ఉదయం పూజారి శ్రవణం కార్యక్రమంలో చెప్పిన ప్రకారం నాగళ్లతో మూడుసార్లు పొలం దున్నుతామని రైతులు తెలిపారు.